# విద్యుత్ తీగలు ఎత్తుకెళ్తున్నారు..

**ఖానాపూర్:** గోదావరి తీరం వెంట ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్లకు కరెంట్ సరఫరా చేసే కాపర్(రాగి) తీగలను దొంగలు ఎత్తుకెళ్తుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఆరుగాలం కష్టించి పనిచేస్తున్నా.. తమకు దిగుబడులు రావడం లేదని ఆవేదన చెందుతున్న కర్షకుల పాలిట ఈ దొంగతనాలు శాపంగా మారాయి. పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కావడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. విద్యుత్ మోటార్‌కు, స్టార్టర్‌కు ఏర్పాటు చేసుకున్న తీగలను కటింగ్ ప్లేయర్‌తో కట్ చేసి ఎత్తుకెళ్తున్నారు. ఈ తీగ మార్కెట్‌లో మీటరుకు రూ.200 వరకు ఉండటంతో దొంగలు పోలీసులకు దొరకకుండా వరుస చోరీలకు పాల్పడుతూ రైతులను ఆర్థికంగా ముంచుతున్నారు.

- గోదావరి తీరం వెంట వరుస చోరీలు
- పోలీసులకు దొరకని దొంగలు
- భయాందోళనలో రైతులు


గత నెల 13న గోదావరి తీరం వద్ద తీగను కట్ చేసి ఎత్తుకెళ్లారని చూపుతున్న రైతులు

**గోదావరి నీటితో పంటల సాగు..**
గోదావరి తీరం వెంట ఉన్న ఖానాపూర్, కడెం మండలాల్లోని గ్రామాల్లో వరుసగా రైతుల మోటార్లకు ఏర్పాటు చేసిన కాపర్ తీగలు తరచుగా చోరీకి గురవుతున్నాయి. ప్రధానంగా బాదన్‌కుర్తి, మస్కాపూర్, సుర్జాపూర్, దిలావార్‌పూర్, ఖానాపూర్, బావాపూర్(కే), లింగాపూర్, గోడలపంపు తదితర గ్రామాల రైతుల వ్యవసాయ భూములు గోదావరి తీరం వెంట ఉంటాయి. దీంతో ఈ ప్రాంతంలోని రైతులు గోదావరి తీరానికి విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసుకొని పంటలు పండిస్తున్నారు.


గోదావరి తీరంలో స్టార్టర్ వద్ద వైరు చోరీ జరిగిన ప్రాంతం చూపుతున్న రైతులు (ఫైల్)

**అప్పుడు అలా.. ఇప్పుడు ఇలా..**
గతంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్(రాగి) తీగలను ఎత్తుకెళ్లే దొంగలు ప్రస్తుతం వారి పంథాను మార్చుకున్నారు. గోదావరి తీరం వెంట రైతులు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటార్లకు.. స్టార్టర్లకు మధ్య ఉండే కాపర్ తీగను కటింగ్ ప్లేయర్ తదితర పరికరాల సాయంతో కట్ చేసి వైరును ఎత్తుకెళ్తున్నారు. తీసుకెళ్లిన వైరును సమీపంలోని పొలాల్లో కాల్చి దానిలోని కాపర్‌వైరును విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

**విచారణ చేస్తున్నాం..**
మోటార్ల తీగలను దొంగలు ఎత్తుకెళ్తున్నారని రైతులు ఫిర్యాదు చేశారు. విచారణ చేసి దొంగలను పట్టుకుంటాం. జనవరిలో చోరీ ఘటనపై ఖానాపూర్, గొడలపంపు రైతులు శనివారం ఫిర్యాదు చేశారు. పొలాల వైపు అనుమానాస్పదంగా తిరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
– రాహుల్ గైక్వాడ్, ఎస్సై, ఖానాపూర్

**వరుస చోరీలు..**
ఖానాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో మూడేళ్లుగా మోటార్ల తీగలను ఎత్తుకెళ్తున్న దొంగలు.. ఇటు రైతులకు, అటు పోలీసులకు చిక్కడం లేదు. విలువైన తీగలను ఎత్తుకెళ్తుండటంతో యాసంగిలో పంటలు చేతికొచ్చే పరిస్థితి లేదు. బాదన్‌కుర్తి, మస్కాపూర్, సుర్జాపూర్, ఖానాపూర్, గోడలపంపు గ్రామాలు ప్రధాన రహదారి ప్రక్కనే ఉన్నందున పోలీసుల గస్తీ పెంచితే దొంగలు తగ్గే అవకాశం ఉంటుంది.

- 2023 జూన్‌లో ఖానాపూర్, గొడలపంపు గ్రామాల్లో 10 మంది రైతులకు సంబంధించిన మోటార్ల తీగలు చోరీ అయ్యాయి.
- గతేడాది మార్చి 16న బాదన్‌కుర్తి గ్రామంలోని తీరం వెంట సుమారు 10 మంది రైతుల కాపర్‌వైర్లను ఎత్తుకెళ్లారు.
- జనవరి 19న ఖానాపూర్, గొడలపంపు గ్రామాలకు చెందిన రైతుల 10 మంది వరకు రైతుల మోటార్‌ల వైర్లు చోరీ అయ్యాయి.
- తాజాగా గత నెల 13న సైతం బాదన్‌కుర్తి, మస్కాపూర్ గ్రామాలకు చెందిన సుమారు 10 మంది రైతుల మోటార్లకు సంబంధించి కాపర్ తీగలు చోరీకి గురయ్యాయి.

### చోరీపై పోలీసులకు ఫిర్యాదు


ఫిర్యాదు చేసిన రైతులు

**ఖానాపూర్:** మోటార్ల తీగలను ఎత్తుకెళ్తున్న దొంగలను పట్టుకోవాలని పట్టణంలోని శ్రీరాంనగర్‌తోపాటు గోడలపంపు గ్రామ రైతులు శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ చేసి దొంగలను పట్టుకుంటామని ఎస్సై.. రైతులకు హామీ ఇచ్చారు.

### మా బాధ ఎవరికీ చెప్పుకోవాలి..



ఓవైపు విద్యుత్ కోతలు, లోఓల్టేజి సమస్యలు.. మరోవైపు దిగుబడులు రాక ఇబ్బంది పడుతున్నాం. ఇలాంటి సమయంలో దొంగలు మా విద్యుత్ తీగలను ఎత్తుకెళ్తున్నారు. మా బాధ ఎవరికీ చెప్పుకోవాలి.
– మొగిలి భీమేశ్, బాదన్‌కుర్తి

### రెండేళ్లుగా చోరీ



బాదన్‌కుర్తి గ్రామంలోని గోదావరి ఒడ్డున ఉన్న తమ పొలానికి నీరు అందించేందుకు విద్యుత్ మోటార్ ఏర్పాటు చేసుకున్నాం. గతేడాది మార్చిలో.. ఈ ఏడాది ఫిబ్రవరిలో సైతం విలువైన కాపర్ తీగలను దొంగలు ఎత్తుకెళ్లారు. ఈ వైరు మీటరుకు మార్కెట్‌లో రూ.200 వరకు ఉంది.
– అంబటి గంగారెడ్డి, బాదన్‌కుర్తి

## క్లుప్తంగా

### స్తంభాన్ని ఢీకొట్టిన కారు


ప్రమాద స్థలంలో కారు

**బాసర:** మండలకేంద్రంలోని బ్రాహ్మణ సత్రం ఎదుట హైదరాబాద్ నుంచి వస్తున్న భక్తుల కారు రోడ్డుపై ఓ ఆవును తప్పించబోయి పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. ఎయిర్ బెలూన్స్ తెరుచుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో భక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్సై గణేశ్.. సిబ్బందితో వచ్చి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు.

### పంటల వివరాలు నమోదు


నమోదు చేస్తున్న ఏఈవో శరణ్య

**లక్ష్మణచాంద:** వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండలంలో పంటల వివరాల నమోదు ప్రక్రియను అధికారులు చేపడుతున్నారు. శనివారం మండలంలోని కనకాపూర్ క్లస్టర్ పరిధిలోని కనకాపూర్‌లో పంటల నమోదు ప్రక్రియను ఏవో వసంత్‌రావు, ఏఈఓ శరణ్య చేపట్టారు. క్షేత్రస్థాయిలో పంటల వద్దకు వెళ్లి రైతుల ఫొటోలతో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. ఇప్పటికే ఈక్లస్టర్‌లో నర్సాపూర్‌లో సర్వే పూర్తయిందని పేర్కొన్నారు.

### లక్ష్మీనరసింహుడికి పూజలు


స్వామివారు

**కడెం:** మండలంలోని దిల్దార్‌నగర్ సమీపంలోని అటవీ ప్రాంతంలో కొండగుహలో కొలువైన శ్రీ అక్కకొండ లక్ష్మీనరసింహ స్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. కొండాడి సురేందర్‌రావు, శ్రీనివాస్‌రావులు నైవేద్య కైకార్యం అందించారు. కార్యక్రమంలో అర్చకులు వొద్దిపర్తి వంశీకృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

### టీకాలపై అవగాహన కల్పించాలి


మాట్లాడుతున్న డీఐఓ నైనారెడ్డి

**నర్సాపూర్(జి):** చిన్నారులతోపాటు గర్భిణులకు అందించే వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి నైనారెడ్డి.. సిబ్బందికి సూచించారు. శనివారం మండలంలోని రాంపూర్ పంచాయతీ పరిధిలోని నసీరాబాద్‌లో వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందించే వైద్యసేవలను వివరించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

### ఏఎస్సైల సేవలు మరువలేనివి


సన్మానిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

**నిర్మల్‌టౌన్:** జిల్లాకేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఏఎస్సైలుగా పని చేసిన దేవరావు, లక్ష్మారెడ్డి సేవలు మరువలేనివని ఎస్పీ జానకీషర్మిల అన్నారు. శనివారం ఉద్యోగ విరమణ చేయగా.. ప్రధాన పోలీస్ కార్యాలయంలో వారిని ఎస్పీ ఘనంగా సన్మానించారు. ఆమె మాట్లాడుతూ.. పోలీస్‌శాఖలో 36 ఏళ్లపాటు సేవలందిందించడం అభినందనీయమన్నారు. ఉద్యోగికి విరమణ సహజమని.. మిగిలిన జీవితం ఆయురారోగ్యాలతో గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఉపేంద్రరెడ్డి, ఏవో యూనిస్ అలీ, వారి కుటుంబసభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఇసుక టిప్పర్ పట్టివేత

**లక్ష్మణచాంద:** మండలకేంద్రం నుంచి నిర్మల్ వైపు అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను శనివారం తెల్లవారుజామున లక్ష్మణచాంద శివారులో పోలీసులు పట్టుకున్నారు. పెట్రోలింగ్ విధులు నిర్వర్తిస్తున్న పోలీసులు ఇసుక టిప్పర్‌ను తనిఖీ చేయగా వారి దగ్గర అనుమతి పత్రాలు లేవని ఎస్సై సుమలత తెలిపారు. టిప్పర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. అనుమతుల్లేకుండా ఇసుక దందా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

### వాహనాలు తనిఖీ


బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షిస్తున్న ఎస్సై

**కుంటాల:** మండలంలోని అంబకంటి వద్ద శనివారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై భాస్కరాచారి.. వాహనదారులకు బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షలు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెల్మెట్, సీట్‌బెల్టు ధరించి.. అన్ని ధ్రువ పత్రాలు కలిగి ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### మొక్కలు ఎండిపోకుండా చూడాలి

**లోకేశ్వరం:** గ్రామపంచాయతీ నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు ఎండిపోకుండా చూడాలని ఎంపీడీవో వెంకటరమేశ్ అన్నారు. శనివారం మండలంలోని నగర్, పిప్రి, గడ్‌చాంద, బామ్నికే గ్రామాల్లో పర్యటించారు. సెగ్రిగేషన్ షెడ్డు, నర్సరీ, పల్లెప్రకృతి వనం పరిశీలించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లోని వీధులను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఏపీవో జగన్నాథ్, గ్రామ కార్యదర్శి విఠల్, టీఏ మంజుల ఉన్నారు.

### క్రమశిక్షణ అలవర్చుకోవాలి

**నిర్మల్‌రూరల్:** విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకొని.. ఉన్నత చదువులు చదవాలని డీఈవో రామారావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని చాణక్య పాఠశాలలో వార్షికోత్సవం నిర్వహించగా డీఈఓ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఇందులో ఎంఈఓ నాగేశ్వరరావు, డీఎస్ఓ వినోద్ కుమార్, పాఠశాల డైరెక్టర్లు వెంకట్ రెడ్డి, ప్రమోద్ రావు, ప్రభాకర్, శంకర్, ప్రిన్సిపాల్ హరీశ్‌కుమార్, తస్మా అధ్యక్షుడు చంద్రాగౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సైన్స్‌ఫేర్‌లో ఆకట్టుకున్న ప్రదర్శనలు

**ముధోల్:** మండలకేంద్రంలోని రబీంద్ర పాఠశాలలో శనివారం సైన్స్‌ఫేర్‌ను ఘనంగా నిర్వహించారు. ఎస్సై సంజీవ్ హాజరై విద్యార్థులు తయారు చేసిన 200 ప్రయోగాలను పరిశీలించారు. అంతరిక్షం, వ్యవసాయం, శాస్త్ర సాంకేతిక వైజ్ఞానిక నమూనాలను ప్రదర్శించారు. అనంతరం ఎస్సై విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అసంవార్ సాయినాథ్, కరస్పాండెంట్ రాజేందర్, చైర్మన్ భీమ్‌రావు దేశాయ్, పోతన్నయాదవ్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.
**ఖానాపూర్:** మండలంలోని మస్కాపూర్ పంచాయతీ పరిధి మధురనగర్ నిస్సి పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన సైన్స్‌ఫేర్‌లో విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విద్యాలత, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.


ముధోల్‌లో రాకెట్ నమూనాతో విద్యార్థులు

## ఆలయాల హుండీ ఆదాయం లెక్కింపు

**దిలావర్‌పూర్:** మండలంలోని కదిలి శ్రీ మతాన్నపూర్ణ పాపహరేశ్వరాలయం, కాల్వ పరిసర అటవీ ప్రాంతంలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయాల హుండీలకు వచ్చిన ఆదాయాన్ని శనివారం దేవాదాయ, ధర్మాదాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో లెక్కించారు. శివరాత్రి వేడుకల సందర్భంగా కదిలి పాపహరేశ్వర ఆలయానికి టికెట్ల ద్వారా రూ.1,57,427 సమకూరగా హుండీ ఆదాయం టికెట్లతో కలిపి రూ.6,39,616 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. కాల్వ నరసింహస్వామి ఆలయంలో హుండీ ఆదాయం లెక్కించగా రూ.6,22,278 సమకూరినట్లు వారు వెల్లడించారు. ఇందులో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ రంగు రవికిషన్‌గౌడ్, ఆలయాల ఈవో భూమయ్య, ఆలయ కమిటీ చైర్మన్లు నార్వాడి వెంకట్రావు పాటిల్, మహేశ్, ఆలయ ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.


కాల్వలో ఆదాయం లెక్కిస్తున్న భక్తులు

## కూలీలకు దుస్తులు పంపిణీ

**లోకేశ్వరం:** మండలంలోని మొహాళ గ్రామ సమీపంలో ఇటుకలబట్టీలో పని చేసే 50 మంది కూలీలకు శనివారం మా అమ్మ–నాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. ఫౌండేషన్ చైర్మన్ ఆంజనేయులు కూతురు క్షేమ–సుమిద్‌కుమార్ పెళ్లిరోజు సందర్భంగా సమకూర్చిన దుస్తులను తహసీల్దార్ మోతీరాం కూలీలకు అందించారు. కార్యక్రమంలో ఆంజనేయులు, సర్వేయర్ సునీత్, నాయకులు రమేశ్, సుధాకర్, భోజన్న ఉన్నారు.


దుస్తులు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ మోతీరాం

### సంక్షేమబోర్డు పథకాలను ప్రైవేటుకు అప్పగించొద్దు

**కడెం:** భవన నిర్మాణ సంక్షేమబోర్డు పథకాలను ప్రైవేటు కంపెనీలకు అప్పగించవద్దని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కడెంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వమే నేరుగా సంక్షేమబోర్డు ద్వారా కార్మికులకు పథకాలను అమలు చేయాలని కోరారు. కార్మికులందరికీ ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. ఇందులో కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు ఊట్ల కోటయ్య, కొమురయ్య తదితరులున్నారు.

### అగ్ని ప్రమాదాలపై అవగాహన

**ముధోల్:** మండలకేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో శనివారం ఫైర్‌స్టేషన్ ఎస్సై రవి విద్యార్థులకు అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్నిప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రధానాచార్యులు సారధి రాజు, అకాడమిక్ ఇన్‌చార్జి దేవేందర్‌చారి ఉన్నారు.

### ఆర్థికసాయం

**ముధోల్:** మండలకేంద్రానికి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు లక్ష్మణ్ భార్య ప్రమాదవశాత్తు ఇంటి స్లాబ్‌పై నుంచి కింద పడటంతో వెన్నెముక విరిగింది. భైంసా పట్టణంలోని జీడీఆర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బాధితురాలని శనివారం ముధోల్ మండల నాయకులు పరామర్శించారు. ఈసందర్భంగా వారికి రూ.ఐదు వేలను ఆర్థికసాయంగా అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కోరి పోతన్న, పీఏసీఎస్ డైరెక్టర్ ధర్మపురి సుదర్శన్, మాజీ ఎంపీటీసీ దేవోజీ భూమేశ్, తాటివార్ రమేశ్, మోహన్‌యాదవ్, బాలు తదితరులు ఉన్నారు.

### అలరించిన వీడ్కోలు వేడుకలు

**దిలావర్‌పూర్:** మండలకేంద్రంలోని కస్తూరిబా బాలికల విద్యాలయంలో శుక్రవారం రాత్రి వీడ్కోలు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎస్‌వో అపర్ణ, విద్యార్థినులు, ఎస్ఆర్టీలు, పలువురు విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### విరాళం అందజేత


విరాళం అందజేస్తున్న దాత

**ఖానాపూర్:** పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి దేవస్థాన భూమి కొనుగోలుకు శనివారం కమిటీ సభ్యులు విరాళాలు సేకరించారు. కాలనీకి చెందిన కానుగుల సరిత–రాజు దంపతులు రూ.11వేలను విరాళంగా అందించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు అల్లాడి వెంకటేశ్వర్లు, సభ్యులు జనార్దన్, భీమన్న, గంగాధర్ ఉన్నారు.

### ఎమ్మెల్యే పరామర్శ

**కుంటాల:** మండలకేంద్రానికి చెందిన న్యాయవాదులు సాదుల సుదర్శన్, గోవర్ధన్, జనార్దన్ తండ్రి సాదుల లింబగిరి, ప్యాదరి చిన్నక్క, లింబా(బి) గ్రామానికి చెందిన ఆదుముల లక్ష్మి ఇటీవల మృతి చెందారు. శనివారం బాధిత కుటుంబాలను ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ పరామర్శించారు. ఆయన వెంట ఆర్మూర్ కోర్టు ఏపీపీ జి.రామకృష్ణ, నిర్మల్ కోర్టు పీపీలు వినోద్ రావు, విశ్వాస్ రెడ్డి, రమణారావు, నిర్మల్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అల్లూరి మల్లారెడ్డి, మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు ఆలూరి కృష్ణవేణి, అప్పాల గణేశ్ చక్రవర్తి, భూషణ్‌రెడ్డి పాల్గొన్నారు.

### సీఐటీయూలో చేరిక

**దస్తురాబాద్:** మండలంలోని ఆయా గ్రామాల్లోని 100 మంది భవన నిర్మాణ కార్మికులు శనివారం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో చేరారు. ఈసందర్భంగా ఆయన కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు. కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, బీమా సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ సంఘం మండలాధ్యక్షుడు రాకేశ్, మండల ప్రధాన కార్యదర్శి జగన్, సభ్యులు రవీందర్, నరేశ్, శేఖర్, రాజేశ్, దుబ్బయ్య, శ్రీను, లచ్చన్న, రమేశ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### ఆవును వెతికేందుకు వెళ్లి..

- సుద్దవాగులో పడి ఒకరి మృతి

**భైంసా:** మండలంలోని వానల్‌పాడ్ గ్రామానికి చెందిన నడిపి సాయన్న (64) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు సుద్దవాగులో పడి మృతి చెందినట్లు భైంసా ఏఎస్సై లక్ష్మణ్ తెలిపారు. సాయన్న ఆవు రెండు రోజుల కిందట తప్పిపోయింది. శుక్రవారం సాయంత్రం ఆవును వెతుకుతూ వాటోలి శివారులోని సుద్దవాగు పరీవాహక ప్రాంతానికి వెళ్లాడు. సుద్దవాగులో దిగి దాటుతుండగా నీటిలో చిక్కుకుని కొంతదూరం కొట్టుకుపోయాడు. ఒడ్డుపై ఉన్న ఓ వ్యక్తి సాయన్నను గమనించి స్థానికులకు సమాచారం అందించాడు. అప్పటికే రాత్రి కావడంతో మరుసటిరోజు కుటుంబీకులు అక్కడికి చేరుకుని పోలీసులకు సమాచారమిచ్చారు. శనివారం ఉదయం పోలీసులు వచ్చి జాలర్ల సాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

## రోడ్డు నిర్మించారు.. మట్టిని మరిచారు


రోడ్డుపై తొలగించని మట్టికుప్పలు


సైడ్ బర్మ్ వేయని రోడ్డు

- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రజలు

**భైంసాటౌన్:** పట్టణంలోని ఎనిమిదోవార్డు పరిధిలో హనుమాన్ కాలనీకి వెళ్లే మార్గంలో ఇటీవల సీసీ రోడ్డు నిర్మించారు. దీంతో హనుమాన్ కాలనీతోపాటు ఓవైసీనగర్‌కు వెళ్లే వారికి సౌకర్యంగా మారింది. ఇంతవరకు బాగానే ఉన్నా.. సీసీ రోడ్డు నిర్మాణం పూర్తిచేసి 20రోజులు దాటింది. అయినప్పటికీ నూతన రోడ్డుపై నీరు నిల్వచేసేందుకు పోసిన మట్టికుప్పలను తొలగించలేదు. దీంతోపాటు సీసీరోడ్డుకు ఇరువైపులా ఎక్కి దిగేందుకు సైడ్ బర్మ్ (మట్టి)వేయలేదు. మొరం పోయకపోవడంతో వాహనదారులు కిందపడుతున్నారు.

**మా బాధ్యత కాదంటున్న అధికారులు..**
ఈ విషయమై మున్సిపల్ అధికారులను వివరణ కోరగా.. తాము రోడ్డు వేయలేదని పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు నిర్మించారని పేర్కొంటున్నారు. మరోవైపు పంచాయతీరాజ్ శాఖ అధికారులను సంప్రదిస్తే తాము వేయలేదని చెబుతున్నారు. దీంతో అధికారులు ఎవరైనా సీసీరోడ్డును పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చేలా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

## పట్టుదలతో చదివితేనే ఫలితాలు

**భైంసాటౌన్:** విద్యార్థులు పట్టుదలతో చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ప్రజాట్రస్ట్ చైర్మన్ బి.మోహన్‌రావు పటేల్ అన్నారు. శనివారం ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఏపీనగర్ జెడ్పీ ఉన్నత పాఠశాల, ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల, కసూర్బా, మైనారిటీ గురుకుల పాఠశాలతోపాటు పలు ప్రైవేట్ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు పరీక్షప్యాడ్లు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు అండగా ఉండాలనే ఉద్దేశంతో ట్రస్ట్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షప్యాడ్లు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.


కేజీబీవీలో విద్యార్థినులతో మోహన్‌రావు పటేల్

## ఎంఐఎం పార్టీ ఆవిర్భావ వేడుకలు

**నిర్మల్‌టౌన్:** జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏఐఎంఐఎం 67వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు అజీమ్ బిన్ యాహియా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ప్రజాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్న పార్టీ తమదని పేర్కొన్నారు. కార్యక్రమంలో అబ్రా హుస్సేన్, ముజాహిద్, మజార్, చాంద్ పాషా, అనిల్‌పాషా తదితరులు పాల్గొన్నారు.
**ఖానాపూర్:** పట్టణంలోని మదీనా కాలనీలో ఎంఐఎం పార్టీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంఐఎం పార్టీ పట్టణ అధ్యక్షుడు అకీల్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి అఫ్సర్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పట్టణ అధ్యక్షుడు అజీమ్ బిన్